నమస్తే తెలంగాణ
హైదరాబాద్
హైదరాబాద్- మేడ్చల్
I | హైదరాబాద్, మంగళవారం 7 జనవరి 2025 | HYDERABAD

## నీటి సరఫరా పునరుద్ధరణ



సిటీబ్యూరో, జనవరి 6 (నమస్తే తెలంగాణ) : హైదరాబాద్ మహానగరానికి తాగునీరు సరఫరా చేసే మంజీరా తాగు నీటి సరఫరా స్కీమ్ ఫేజ్-1లో కలబ్‌గూర్ నుంచి లింగంపల్లి వరకు పీఎస్సీ, ఎంఎస్ పైపులైన్‌కు ఏర్పడ్డ లీకేజీలకు 5 ప్రాంతాల్లో మరమ్మత్తులు పూర్తి అయ్యాయి. కందివాగు, ఇస్నాపూర్, బీరంగూడ, అశోక్‌నగర్, బీహెచ్ ఈఎల్ మెయిన్‌గేట్, హుడా కాలనీ, చందానగర్ ప్రాంతాల్లో మరమ్మత్తులు పూర్తి అయినట్లు జలమండలి అధికారులు సోమవారం రాత్రి ఒక ప్రకటనలో తెలిపారు. కలబ్‌గూర్ నుంచి నీటిని సరఫరా చేయడం ప్రారంభించినట్లు, నీటి సరఫరా పునరుద్ధరణ జరిగినట్లు చెప్పారు.

# మెట్రోకు అదనపు బోగీలు

### అన్ని మార్గాలో అదనంగా 4 బోగీలతో మెట్రో ప్రయాణం

### పుణే కోచ్ ఫ్యాక్టరీ నుంచి తెచ్చేందుకు మెట్రో సంస్థ సన్నాహాలు

సిటీబ్యూరో, జనవరి 6 (నమస్తే తెలంగాణ) : హైదరాబాద్ మెట్రోలో అదనపు బోగీల (కోచ్) ఏర్పాటుకు ఎట్టకేలకు హెచ్ ఎంఆర్ఎల్ దృష్టి సారించింది. ఏడాది కాలంగా అదనపు బోగీలను ఏర్పాటు చేస్తున్నామని చెబుతున్నా.. ఇంతవరకు కార్యరూపంలోకి రాలేదు. కానీ ఈ నెలాఖరులోగా నగరానికి కొత్త బోగీలను తీసుకువచ్చేలా హెచ్ఎంఆర్ఎల్ చర్యలు చేపట్టింది. ఇందుకుగాను రద్దీగా ఉండే మార్గాలను తొలి దఫా అందుబాటులోకి తీసుకు రానున్నారు. అమీర్‌పేట్, రాయదుర్గ్, జేబీఎస్ పరేడ్ గ్రౌండ్, సికింద్రాబాద్ వంటి స్టేషన్లను విపరీతంగా ప్రయాణికుల రద్దీని దృష్టిలో పెట్టుకుని, నాలుగు అదనపు కోచ్‌లను నాగ్‌పూర్, పుణే మెట్రో నుంచి లీజుకు తీసుకోనున్నట్లుగా తెలిసింది. గడిచిన కొంతకాలంగా నిత్యం ఐదున్నర లక్షలకు పైగా ప్రయాణం చేస్తున్నారు. ముఖ్యంగా ఆఫీసు సమయాల్లో నాగోల్-రాయదుర్గ్ మార్గంలో విపరీతమైన రద్దీ ఉంటుంది. కిక్కిరిసిన జనాలతో స్టేషన్లన్నీ నిండిపోతున్నాయి. అయినా రద్దీకి అనుగుణంగా బోగీలు అందుబాటులో లేకపోవడంతో.. మరో రైలు వచ్చేంత వరకు ప్లాట్‌ఫాంపై ఎదురుచూసే వారి సంఖ్య పెరుగుతూనే ఉంది. ఈ క్రమంలో ఏడాదిన్నర కాలంగా బోగీలను పెంచాలనే డిమాండ్ చేస్తున్నా... అటు మెట్రో కానీ, ఎల్ అండ్ టీ కానీ పట్టించుకోలేదు. తాజాగా ప్రయాణికుల ఒత్తిడి మేరకు బోగీలను పెంచేందుకు సన్నాహాలు చేయాలని ప్రభుత్వం చర్యలు తీసుకుంది.

#### రద్దీ సమస్యకు పరిష్కారం..

నిజానికి గత ఏడాది జులై నాటికే కొత్త బోగీలను ఏర్పాటు చేసుకోవాలని మెట్రో భావించింది. కానీ ఎల్ అండ్ టీ ఆసక్తి చూపలేదు. ఇప్పటికే నిర్వహణ భారం పేరిట అరకొర వసతులతోనే సేవలను అందిస్తుండగా.. కొత్త బోగీలు అసాధ్యమేనన్నట్లుగా వ్యవహరించింది. ఇక హెచ్ఎంఆర్ఎల్ కూడా అంతగా దృష్టి సారించలేదు. దీంతో మెట్రో ప్రారంభమై దాదాపు ఆరేళ్లు గడిచినా కొత్త బోగీల ఊసే లేకుండాపోయింది. అయితే ఇటీవల కాలంలో క్రమంగా పెరుగుతున్న మెట్రో ప్రయాణికులతో సాధారణ సమయంలోనూ స్టేషన్ల వద్ద భారీగా రద్దీ ఏర్పడుతున్నది. ఈ క్రమంలో హెచ్ఎంఆర్ఎల్ ఎట్టకేలకు కొత్త బోగీలను ఏర్పాటు చేసేందుకు చర్యలు చేపట్టింది. తొలి దఫా నాలుగు బోగీలను లీజ్ ప్రతిపాదికన తీసుకువచ్చేలా చర్యలు చేపట్టింది. దీనికోసం పుణే మెట్రో నుంచి ఇంజన్ రహిత బోగీలను తీసుకురానున్నారు.

#### వచ్చే నాలుగేండ్లలో ఓల్డ్‌సిటీ మెట్రో..!

హైదరాబాద్ ఓల్డ్ సిటీలో చేపట్టే మెట్రో రైల్వే లైన్ నిర్మాణం కోసం ఇండ్లు, భూములు కోల్పోయిన బాధితులకు మెట్రో స్టేషన్లలో వ్యాపారం చేసుకునేందుకు ప్రథమ ప్రాధాన్యత కల్పించాలని ఎంఐఎం పార్టీ అధ్యక్షుడు, ఎంపీ అసదుద్దీన్ ఓవైసీ అన్నారు. కలెక్టరేట్‌లో సోమవారం మెట్రో రైల్ నిర్మాణంలో భాగంగా ఇండ్లు, స్థలాలు కోల్పోయిన 40 మంది భూ నిర్వాసిత లబ్దిదారులకు రూ.18.63 కోట్ల రూపాయల చెక్కులను కలెక్టర్ అనుదీప్, మెట్రో ఎండీ ఎన్వీఎస్ రెడ్డితో కలిసి ఆయన అందించారు. ఈ సందర్భంగా అసదుద్దీన్ మాట్లాడుతూ.. మెట్రో ప్రాజెక్టు ఫేజ్ 2 కింద 6వ కారిడార్‌ను 7.5 కిలో మీటర్లలో భాగంగా మెట్రో నిర్మాణ పనులు ఎంజీబీఎస్ నుంచి చాంద్రాయణ గుట్ట వరకు నిర్మాణ పనులు జరగనున్నట్టు తెలిపారు. రూ.2,741 కోట్లతో ప్రభుత్వం పనులు చేపట్టనున్నట్టు తెలిపారు. నాలుగేండ్లలో అందుబాటులోకి వస్తుందని చెప్పారు. స్టేషన్లను సాలర్ జంగ్ మ్యూజియం, చార్మినార్, శాలిబండ, అలియాబాద్, ఫలక్‌నుమాలో చేపట్టడం జరుగుతుందని వివరించారు. అర్హులైన ప్రాంత వాసులకు మెట్రో స్టేషన్లలో ఉపాది కల్పించాలని కోరారు. లబ్దిదారులకు గజానికి 60వేలు చెల్లించవలసి ఉండగా సీఎం సూచనలతో 81 వేలు పెంచడం జరిగిందని పేర్కొన్నారు. అనంతరం మెట్రో ఎండీ ఎన్వీఎస్ రెడ్డి మాట్లాడుతూ.. ఓల్డ్‌సిటీలో రూ.2741 కోట్లతో అత్యంత ఉన్నత ప్రమాణాలతో చేపట్టే మెట్రోలైన్ కారిడార్ 6ను నాలుగేండ్లలో పూర్తి చేస్తామని తెలిపారు. కలెక్టర్ అనుదీప్ మాట్లాడుతూ.. ఓల్డ్‌సిటీని మరింత అభివృద్ధి చేయడమే ప్రభుత్వ లక్ష్యమని అన్నారు. ఈ కార్యక్రమంలో మెట్రో భూసేకరణ శాఖ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ స్వర్ణలత, ఆర్డీఓ రామకృష్ణ, జీహెచ్ఎంసీ అధికారులు తెలిపారు.

రైతు భరోసా హామీపై కాంగ్రెస్ చేసిన మోసంపై ధర్నా చేస్తున్న కంటోన్మెంట్ బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జక్కుల మహేశ్వర్‌రెడ్డి, మాజీ సభ్యులు, రైతులు

## మోసాలకు మారుపేరు కాంగ్రెస్ ప్రభుత్వం

### రైతు భరోసా 15 వేలు ఇస్తామని ఇప్పుడు మాట తప్పారు

### జేబీఎస్ వద్ద బీఆర్ ఎస్ శ్రేణుల ఆందోళన

కంటోన్మెంట్, జనవరి 6 : కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన నాటి నుంచి రైతులను అడుగడుగునా మోసం చేస్తున్నదని, మోసాలకు ఆ పార్టీ మారుపేరని బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు, కంటోన్మెంట్ బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జక్కుల మహేశ్వర్‌రెడ్డి విమర్శించారు. ఎన్నికల సమయంలో రూ.15 వేలు ఇస్తామని ఊదరగొట్టి, ఇప్పుడు రూ.12 వేలు మాత్రమే ఇస్తామని మోసం చేస్తున్నదని కాంగ్రెస్‌పై మండిపడ్డారు. రైతు భరోసాపై కాంగ్రెస్ పార్టీ చేస్తున్న మోసాన్ని ఎండగడుతూ బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఇచ్చిన పిలుపు మేరకు సోమవారం కంటోన్మెంట్‌లోని జూబ్లీ బస్ స్టాండ్ చౌరస్తా వద్ద రైతులతో కలిసి బీఆర్ఎస్ పార్టీ నేతలు ప్లకార్డులు చేతబట్టి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జక్కుల మహేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ సర్కారు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాక ముందు ఎన్నో హామీలను ఇచ్చిందని రైతుభరోసా రూ.12 వేలు కాకుండా ఇచ్చిన హామీ ప్రకారం రూ.15 వేలు ఇవ్వాల్సిందేనని స్పష్టం చేశారు. మాట తప్పిన కాంగ్రెస్ సర్కార్‌కు గుణపాఠం తప్పదన్నారు. కార్యక్రమంలో బోర్డు మాజీ సభ్యులు పాండుయాదవ్, లోక్‌నాథం, అనితాప్రభాకర్, నళినికిరణ్‌తో పాటు నేతలు రామకృష్ణ, శ్రీకాంత్, శ్రీధర్, విజయ్, శ్రీనివాస్‌తో పాటు ఆయా వార్డుల అధ్యక్షులు, పార్టీ శ్రేణులు భారీ ఎత్తున పాల్గొన్నారు.

## ప్రజావాణిలో 149 వినతులు

సిటీబ్యూరో, జనవరి 6 (నమస్తే తెలంగాణ) : ప్రజావాణిలో వచ్చిన వినతులను త్వరితగతిన పరిష్కరించాలని జీహెచ్ఎంసీ డిప్యూటీ మేయర్ మోతె శ్రీలత శోభన్ రెడ్డి అధికారులను సోమవారం ఆదేశించారు. ప్రజల సమస్యలు పరిష్కరించడంపై అధికారులు చొరవ చూపాలన్నారు. ప్రజావాణి ఫోన్ ఇన్ ప్రోగ్రాం ద్వారా నాలుగు విన్నపాలు రాగా, సత్వర పరిష్కారానికి ఆయా విభాగాలను అందించినట్లు అధికారులు తెలిపారు. జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో 44 వినతులు రాగా అందులో టౌన్‌ప్లానింగ్ 10, ఇంజనీరింగ్ 7, ఎఫ్ఏ సెక్షన్ 5, శానిటేషన్ మూడు, ట్యాక్స్, హెల్త్, అడ్మినిస్ట్రేషన్, హౌసింగ్, ఎల్క్ట్రికల్, యూబీడీ విభాగాలకు రెండు ఫిర్యాదుల చొప్పున ఫిర్యాదులు వచ్చాయన్నారు. జీహెచ్ఎంసీ పరిధిలోని ఆరు జోన్లలో మొత్తం 105 వినతులు వచ్చాయని, కూకట్‌పల్లిలో 50, సికింద్రాబాద్ జోన్‌లో 12, శేరిలింగంపల్లి జోన్‌లో 18, చార్మినార్ జోన్‌లో 7, ఎల్బీనగర్ జోన్‌లో 13, ఖైరతాబాద్ జోన్‌లో 5 ఆర్జీలతో కలిపి మొత్తం 149 వినతులు వచ్చాయని అధికారులు తెలిపారు.

అందుబాటులోకి వచ్చిన ఫ్లై ఓవర్

## కేసీఆర్ హయాంలో పనులు కాంగ్రెస్ ప్రభుత్వంలో ప్రారంభోత్సవాలు

- అందుబాటులోకి ఆరాంఘర్-జూపార్కు ఫ్లై ఓవర్
- ప్రారంభించిన సీఎం రేవంత్ రెడ్డి
- ఫ్లై ఓవర్‌కు డాక్టర్ మన్మోహన్ సింగ్ పేరు

సిటీబ్యూరో, జనవరి 6 (నమస్తే తెలంగాణ) : హైదరాబాద్ నగరంలో ట్రాఫిక్ జంఝాటాలు లేని ప్రయాణం కోసం కేసీఆర్ ప్రభుత్వ హయాంలో రూపకల్పన చేసి ప్రారంభించిన ఎస్సార్టీపీ ఫలాలు ఒక్కొక్కటిగా ప్రస్తుతం అందుబాటులోకి వస్తున్నాయి. ఇందులో భాగంగా 23వ ఫ్లై ఓవర్ అందుబాటులోకి వచ్చింది. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో రూ.799.74కోట్లతో ఆరాంఘర్ నుంచి జూపార్క్ వరకు ఆరు లేన్లతో119 ఫిల్లర్లతో 4.08 కిలోమీటర్ల మేర ఫ్లై ఓవర్ పనులను చేపట్టగా చివరి దశ పనులను కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తి చేసి సోమవారం సీఎం రేవంత్‌రెడ్డి ప్రారంభించారు. ఈ ఫ్లై ఓవర్ ప్రారంభం ద్వారా ఉప్పల్ నుంచి ఎల్బీనగర్, బైరామల్‌గూడ, ఓవైసీ ఫ్లై ఓవర్, అబ్దుల్ కలాం ఫ్లై ఓవర్, చాంద్రాయణ గుట్ట ఫ్లై ఓవర్ మీదుగా జూపార్కు - ఆరాంఘర్ ఫ్లై ఓవర్ మీదుగా శంషాబాద్ విమానాశ్రయం వరకు ప్రయాణం సాఫీగా సాగనుంది. ఆరాంఘర్, శాస్త్రిపురం, కాలాపత్తర్, దారుల్ ఉల్ం, శివరాంపల్లి, హసన్‌నగర్ జంక్షన్లకులో ట్రాఫిక్ రద్దీకి శాశ్వత ఉపశమనం లభించనుంది. ఈ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ హైదరాబాద్ నగర అభివృద్ధే తెలంగాణ అభివృద్ధి అని రోడ్ల విస్తరణ, మెట్రో నిర్మాణం, ఉపాధి అవకాశాలు మరింత మెరుగుపర్చాల్సి ఉందన్నారు. ఈ సందర్భంగా ఆరాంఘర్-జూపార్క్ ఫ్లై ఓవర్‌కు డాక్టర్ మన్మోహన్ సింగ్ పేరు పెట్టాలని సూచిస్తున్నట్లు రేవంత్‌రెడ్డి జీహెచ్ఎంసీ అధికారులను ఆదేశాలు జారీ చేశారు. కాగా కేసీఆర్ ప్రభుత్వం ఎస్ఆర్‌డీపీ కింద జీహెచ్ఎంసీ ఆధ్వర్యంలో చేపట్టిన 42 ప్రాజెక్టుల్లో 36 ప్రాజెక్టులు అందుబాటులోకి రాగా, 37వ ప్రాజెక్టుగా ఆరాంఘర్ ఫ్లై ఓవర్ నిలించింది. తాజాగా ఈ కార్యక్రమంలో మేయర్ గద్వాల్ విజయలక్ష్మి, మంత్రి శ్రీధర్ బాబు, ఎంపీలు అసదుద్దీన్ ఒవైసీ, అనిల్‌కుమార్ యాదవ్, సీఎం సలహాదారు వేం నరేందర్ రెడ్డి, ఎంఐఎం ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, కార్పొరేషన్ ఛైర్మన్లు, జీహెచ్ఎంసీ అధికారులు పాల్గొన్నారు.

## బోరు వేస్తే.. ఇల్లు కడితే

### భారీగా డబ్బులు అడుగుతున్నారు

- నకిలీ విలేకరుల వేధింపులు ఎక్కువయ్యాయి
- చర్యలు తీసుకోండి
- బీఆర్ఎస్ నేత మంగళ పురి వెంకటేశ్

మేడ్చల్ కలెక్టరేట్, జనవరి 6 : బోరు వేస్తున్నా, ఇల్లు కడుతున్నా వెంటనే వచ్చి భారీ మొత్తంలో డబ్బులు డిమాండ్ చేస్తున్న నకిలీ విలేకరులపై అధికారులు చర్యలు తీసుకోవాలని మేడ్చల్ బీఆర్ఎస్ నేత, దమ్మాయిగూడ మున్సిపాలిటీ 4వ వార్డు కౌన్సిలర్ మంగళపురి వెంకటేశ్ డిమాండ్ చేశారు. సోమవారం కీసర మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ దమ్మాయిగూడ, నాగారం మున్సిపాలిటీలలో నకిలీ విలేకరుల వేధింపులు ఎక్కువయ్యాయన్నారు. ఒక్కో పైసా కూడబెట్టుకొని ప్రజలు ఇళ్లు కట్టుకుంటే, బోర్లు వేస్తే నకిలీ విలేకరులు వెంటనే వచ్చి భారీ మొత్తంలో డబ్బులు డిమాండ్ చేస్తున్నారని అవేదన వ్యక్తం చేశారు. దమ్మాయిగూడ మున్సిపాలిటీ అహ్మద్‌గూడలో తనకు ఉన్న ఇంటి ఆవరణలో అన్ని అనుమతులతో రెండు గదులు నిర్మిస్తుంటే నంబర్ లేని ద్విచక్ర వాహనంపై ఓ వ్యక్తి వచ్చి తాను హెచ్ఎంటివి విలేకరినంటూ బెదిరించాడని చెప్పారు. ఇంటి నిర్మాణం కొనసాగాలంటే తనకు డబ్బులు ఇవ్వాలని లేని పక్షంలో ఇంటిని కూల్చే వేయిస్తానని నరేష్ రెడ్డి బెదిరించాడని ఆరోపించారు. గతంలో అనేక మంది కీసర పోలీస్ స్టేషన్‌లో నకిలీ విలేకరి నరేశ్ రెడ్డిపై ఫిర్యాదు కూడా చేశారని, ప్రస్తుతం తాను కూడా కీసర పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశానని చెప్పారు. నకిలీ ఐడి కార్డులతో అధికారులు, ప్రజలను, ప్రజాప్రతినిధులను డబ్బులు డిమాండ్ చేస్తూ బెదిరిస్తున్న నకిలీ విలేకరుల విషయంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

ఆధునీకరించిన చర్లపల్లి రైల్వే టర్మినల్‌ను వర్చువల్‌గా ప్రారంభిస్తున్న ప్రధాని మోదీ, కార్యక్రమంలో పాల్గొన్న గవర్నర్ బిష్ణుదేవ్, కేంద్ర మంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్, మంత్రి శ్రీధర్ బాబు, ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి

## చర్లపల్లి టర్మినల్‌కు.. కొత్త సొబగులు

### 430 కోట్లతో రైల్వే స్టేషన్ ఆధునీకరణ

### వర్చువల్‌గా ప్రారంభించిన ప్రధాని నరేంద్ర మోదీ

చర్లపల్లి, జనవరి 6 : 430 కోట్ల రూపాయలతో ఆధునీకరించిన చర్లపల్లి రైల్వే స్టేషన్ టర్మినల్‌ను ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ సోమవారం వర్చువల్‌గా ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర గవర్నర్ బిష్ణుదేవ్ వర్మ, కేంద్ర మంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజేయ్, మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రధాన మంత్రి మోదీ మాట్లాడుతూ వచ్చే ఐదేండ్లలో జాతీయ రహదారులను మెరుగుపరిచేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి మాట్లాడుతూ దేశవ్యాప్తంగా రైల్వే వ్యవస్థ గడిచిన పది సంవత్సరాల కాలంలో ఎంతో అభివృద్ధి సాధించిందని నూతన స్టేషన్ల అధునీరణకు కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకుందని గుర్తు చేశారు. అనంతరం స్టేషన్ పరిధిలోని పలు ప్రాంతాలలో నూతనంగా ఏర్పాటు చేసిన రైళ్లను ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి జెండా ఊపి ప్రారంభించారు.

చర్లపల్లి రైల్వే స్టేషన్‌లో ఏర్పాటు చేసిన రైలును ప్రారంభిస్తున్న స్థానిక ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి తదితరులు

## ఎలివేటెడ్ భూసేకరణ ముందుకు సాగేదెట్లా?

### ప్యారడైజ్ నుంచి లోతుకుంట వరకు భూసేకరణ పనులపై కోర్టు స్టే

### 329 ఆస్తులకు మార్కింగ్

మేడ్చల్, జనవరి 6 (నమస్తే తెలంగాణ): ఎలివేటేడ్ కారిడార్ భూ సేకరణ పనులు అంత సులువుగా ముందుకు సాగే పరిస్థితి కనిపించడం లేదు. ప్యారడైజ్ నుంచి శామీర్‌పేట్ వరకు రాజీవ్ రహదారిపై నిర్మించనున్న ఎలివేటేడ్ కారిడార్‌కు అవసరమైన భూ సేకరణ పనులలో కొందరు న్యాయస్థానాలను ఆశ్రయించారు. ఈ క్రమంలో భూ సేకరణ పనులను వారం రోజుల వరకు చేయవద్దని కోర్టు నుంచి స్టే వచ్చింది. వారం తర్వాత తిరిగి భూ సేకరణ పనులను ప్రారంభించి భూ సేకరణ పనులు పూర్తి చేస్తామని అధికారులు చెబుతున్నప్పటికీ భూ సేకరణ పనులు పూర్తయ్యేందుకు సాంకేతిక సమస్యలు ఎదురయ్యే అవకాశం కనిపిస్తుందని అధికారులు విశ్లేషిస్తున్నారు. 18 కిలోమీటర్ల పొడవైన విస్తరణకు అవసరమైన భూమి కోసం రెండు జిల్లాలో భూ సేకరణ జరుగుతున్నది. లోతుకుంట నుంచి శామీర్‌పేట్ రింగ్ రోడ్డు వరకు 12 కిలో మీటర్లు మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా పరిధిలో ఉండగా లోతుకుంట నుంచి ప్యారడైజ్(జేబీఎస్)వరకు 6 కిలోమీటర్లు హైదరాబాద్ జిల్లా పరిధిలో ఉంది. ప్రస్తుతం ఉన్న రాజీవ్ రహదారిని రెండు వందల ఫీట్ల రోడ్డుగా విస్తరించనున్నారు. ఈ రహదారిపైన 18 కిలోమీటర్ల మేరకు బ్రిడ్జిని నిర్మించనున్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఎలివేటేడ్ కారిడార్ ఏర్పాటుకు ప్రతిపాదించిన విషయం విదితమే.

#### 329 నిర్మాణాలకు మార్కింగ్

హైదరాబాద్ జిల్లా పరిధిలోకి వచ్చే లోతుకుంట నుంచి ప్యారడైజ్(జేబీఎస్)వరకు వారం రోజుల పాటు భూ సేకరణ పనులకు బ్రేక్‌పడింది. మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా పరిధిలోని శామీర్‌పేట్ రింగ్‌రోడ్డు నుంచి లోతుకుంట వరకు వంద శాతం భూ సేకరణ పనులు పూర్తయైనట్లు అధికారులు వెల్లడిస్తుండంగా భూ సేకరణలో కోల్పోతున్న ఆస్తుల యజమానులకు నష్టపరిహారం అందించే విషయమై స్పష్టంగా చెప్పలేకపోతున్నట్లు అధికారులపై ఆరోపణలు వస్తున్నాయి. మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా పరిధిలో కారిడార్ కింద 329 నిర్మాణాలు నేలమట్టం కానున్నాయి. వాటికి సంబంధించి మార్కింగ్ పనులను పూర్తి చేశారు. హైదరాబాద్ జిల్లా పరిధిలో భూ సేకరణ పనులు ప్రారంభమైతే ఎన్ని నిర్మాణాలు, రోడ్డు విస్తరణకు ఎంత భూమి అవసరమవుతుందని భూ సేకరణ తర్వాత తేలనుంది. కారిడార్ కింద ఆస్తులు కోల్పోతున్న వారికి ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణానికి సంబంధించి పూర్తి అవగాహన నష్టపరిహారం ప్యాకేజీని వివరించి భూ సేకరణ పనులను ప్రారంభిస్తామని అధికారులు స్పష్టం చేస్తున్నారు. భూ సేకరణ పనులు పూర్తి చేసి వివరాలను అధికారులు ప్రభుత్వానికి సమర్పించనున్నారు.

## 3 జిల్లాలు.. 28 నియోజకవర్గాలు 1.12 కోట్ల ఓటర్లు

**జిల్లాల వారీగా ఓటర్ల వివరాలు ..**

| జిల్లా | పురుషులు | మహిళలు | ఇతరులు | మొత్తం |
|---|---|---|---|---|
| హైదరాబాద్ | 23,53,151 | 22,70,292 | 345 | 46,23,788 |
| రంగారెడ్డి | 18,83,272 | 17,78,516 | 433 | 36,62,221 |
| మేడ్చల్-మల్కాజిగిరి | 15,17,375 | 14,30,746 | 416 | 29,48,537 |
| మొత్తం | 57,53,798 | 54,79,554 | 1,194 | 1,12,34,546 |



సిటీబ్యూరో, జనవరి 6 (నమస్తే తెలంగాణ) : ప్రత్యేక ఓటరు సవరణ కార్యక్రమం-2025లో భాగంగా చేపట్టిన ఓటరు నమోదు, సవరణలో సోమవారం ఎన్నికల సంఘం తుది ఓటరు జాబితాను విడుదల చేసింది. గతంలో కంటే హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల పరిధిలో స్వల్పంగా ఓటర్లు పెరిగారు. ఫిబ్రవరి 2024 నాటికి కోటి 10 లక్షలు ఉండగా, తాజా జాబితా ప్రకారం మూడు జిల్లాలలోని 28 నియోజకవర్గాల్లో కలిపి కోటి 12 లక్షలుగా నమోదు అయ్యారు. ఏడాదిలో రెండు లక్షల ఓటర్లు పెరిగినట్లు అధికారులు వెల్లడించారు. ఓటరు నమోదు, సవరణ కార్యక్రమాలను పక్కాగా చేపట్టామని, నకిలీ ఓటర్లు ఒకరికి రెండు, అంతకు మించి ఓటరు కార్డు లున్న వారిని గుర్తించి తొలగించినట్లు అధికారులు చెప్పారు. కాగా మూడు జిల్లాల పరిధిలోని 28 నియోజకవర్గాల్లో అతి పెద్ద నియోజకవర్గంగా 7.65 లక్షల ఓటర్లతో శేరిలింగంపల్లి మొదటి స్థానంలో, 7.34 లక్షల ఓటర్లతో కుత్బుల్లాపూర్ రెండవ స్థానంలో నిలిచాయి. 2.32 లక్షల ఓటర్లతో చార్మినార్ చివరి స్థానంలో నిలిచింది.